
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

సోమవారం 8 డిసెంబరు 2025

సిండికేట్ వార్

- కడపలో క్వార్టర్‌పై రూ.10-20కి పెంచే యత్నం
- ఒప్పుకునేది లేదన్న కమలాపురం నేత
- అవసరమైతే ఎమ్మార్పీ కంటే తక్కువకే అమ్మాలంటూ అనుచరులకు హుకుం
- ఆ నేతపై ఒత్తిడి తెచ్చేందుకు విశ్వప్రయత్నం
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఓ బ్యాచ్

జగన్ హయాంలో జే బ్రాండ్‌లు తాగి ఎందరో మందుబాబులు ఆరోగ్యాన్ని గుల్ల చేసుకోగా, పలువురు మృత్యువాత పడ్డారు. పిచ్చి బ్రాండ్లను ఎక్కువ రేట్లకు అమ్మి పేదల కష్టాన్ని దోచుకున్నారు. చంద్రబాబు సీఎం కావడంతో జే బ్రాండ్‌లకు మంగళం పలికారు. నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకే అందుబాటులోకి తెచ్చారు. దీంతో మందుబాబులు కూటమి సర్కారుపై ఫీల్‌గుడ్‌గా ఉన్నారు. కాగా ఇప్పుడు చంద్రబాబు సర్కారుకు మచ్చ తెచ్చేలా కడపలో మద్యం అమ్మకాల సిండికేట్ కోసం కొందరు స్కెచ్ వేస్తున్నారు. కడప పాలిటిక్స్‌కు ఎలాంటి సంబంధమే లేని వారు టీడీపీ అధికారంలోకి వచ్చాక కడపలో చక్రం తిప్పుతున్నారు. క్వార్టర్‌పై రూ.10 నుంచి రూ.20లకు అదనంగా పెంచి కోట్లు గడించాలని వున్నారు. ఇందుకు కమలా పురం పెద్దాయన ఒప్పుకోవడం లేదని సమాచారం. అవసరమైతే ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయించాలని వారి అనుచరులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పుడు జిల్లా దేశం నేతల్లో సిండికేట్ వార్ నడుస్తోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఎమ్మార్పీ రేట్లకే నాణ్యమైన మద్యం దొరుకుతోంది. అయితే ఇటీవల కడపలోని కొన్ని బ్రాందీషాపులను ముఖ్య నేతల బంధువులు, ఇతరులు దక్కించుకున్నారు. వారు కూడా కడప నియోజకవర్గానికి సంబంధించిన నేతలు కాదు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలనుకున్న ఆ బ్యాచ్ ప్రస్తుతం అధికారంలో ఉండడం, పలు బ్రాందీషాపులు చేతుల్లో ఉండడంతో ఎమ్మార్పీ రేట్లకు మద్యం అమ్మకుండా సిండికేట్ చేసి అధిక రేట్లకు విక్రయించేందుకు ప్లాన్ చేసినట్లు చెబుతారు. ఇప్పటికే ఆ బ్యాచ్ కడపలో తమ మార్క్ పాలిటిక్స్‌ను అమలు చేసింది. మేం చెప్పిందే వేదం అన్నట్లుగా సిండికేట్ బ్యాచ్ ప్రయత్నం చేస్తోంది. అయితే వీరంతా హార్డ్‌కోర్ టీడీపీ, స్థానిక టీడీపీ నేతలు కాకపోవడం గమనార్హం. ఎలక్షన్‌లప్పుడు సై అంటే సై అని ఫైట్ చేసిన వారూ కాదు.. కేవలం భజన బ్యాచ్. వీరు కడపలో మద్యం వ్యాపారాన్ని సిండికేట్ చేసి క్వార్టర్ మీద రూ.10-20 పెంచాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు గానూ ఇటీవల



మద్యం వ్యాపారులతో తరచూ మీటింగ్‌లు ఏర్పాటు చేసి 'అధికారం మనదే, మీరంతా సిండికేట్‌గా రండి, మనం ఎక్కువ అమ్మినా మనలను ఎవరూ ఏం పీక్కోలేరు' అంటూ బహిరంగంగానే మీటింగ్‌లో చెప్పినట్లు సమాచారం. ఆ మీటింగ్‌కు కమలాపురానికి చెందిన మద్యం వ్యాపారులూ హాజరయ్యారు. వారు మాత్రం తమ నేతకు చెప్పి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. కాగా ఆ నేత మాత్రం సిండికేట్‌కు ఒప్పుకునేది లేదని, అవసరమైతే ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయించాలని వారి అనుచరులకు హుకుం జారీ చేయడంతో దుమారం రేపుతోంది.

సిండికేట్ అయితే ప్రభుత్వానికి చెడ్డపేరే..

కడప కార్పొరేషన్‌లో 22 వైన్‌షాపులు ఉన్నాయి. ఇక్కడ సరాసరి ఒక్కో షాపులో రూ.2లక్షల మేర మద్యం వ్యాపారం కొనసాగుతోంది. సరాసరి ఒక్కోషాపు నుంచి 2వేల క్వార్టర్ బాటిల్స్ అమ్మకాలు అవుతున్నాయి. ఇందులో ఒక్కోషాపులో రూ.99 విలువ చేసేది 800, రూ.130 రకం 500, రూ.230 చేసే బాటిల్ రూ.500, మొత్తం 1800, అంత కన్నా పై రేట్లు వుండేవి 200 వస్తాయి. అంటే మొత్తం 22 షాపులకు 44 వేల బాటిళ్ల రోజూ అమ్ముడవుతున్నాయి. బాటిల్‌కు రూ.10 పెంచినా రోజూ సుమారు రూ.4.40 లక్షలు, నెలకు సుమారు రూ.1.30 కోట్లు, ఏడాదికి సుమారు రూ.15 కోట్లు మందుబాబులపై భారం మోపి వారి రక్తాన్ని తాగేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. కానీ కమలాపురం నేత ఇందుకు ఒప్పుకోకపోవడంతో కడప నేతలంతా ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలిసింది.

కడప కార్పొరేషన్‌లో ఉన్న మద్యం షాపుల్లో కడప టీడీపీ గ్యాంగ్‌కు 7, వైసీపీకి 3, జనసేన 3, కమలాపురం టీడీపీ నేతలకు చెందిన వారికి 4, ఇతరులవి 5 షాపులున్నాయి. ప్రస్తుతం కడప మద్యం వ్యాపారుల్లో టీడీపీ, వైసీపీ, జనసేన చెందిన కార్యకర్తలున్నారు. జనసేన మిత్రపక్షమైనప్పటికీ మద్యం అమ్మకాల్లో కడప నేతలు వైసీపీ నేతలకే ప్రియార్టీ ఇస్తారనే చర్చ ఉంది. వైసీపీకి చెందిన ఓ బ్రాందీషాపును మార్చుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన బ్యాచ్ జనసేనకు చెందిన బ్రాందీషాపును అడ్డుకోవడం పెద్ద చర్చకు దారితీస్తోంది.

రూ.5 తక్కువకే అమ్మండి

కడప కార్పొరేషన్‌లో మద్యం సిండికేట్ చేసే యత్నాన్ని కమలాపురం నేత దృష్టికి తీసుకెళ్లగా మనకు సిండికేట్ వద్దు, ఎమ్మార్పీకి అమ్మండి, ఒకవేళ వారంతా సిండికేట్ అయితే మన షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.5కు తక్కువే అమ్మాలని ఆదేశించినట్లు చెబుతారు. కడప కార్పొరేషన్‌లో ఈ నేతకు నాలుగు వైన్‌షాపులు ఉన్నాయి. అవి కూడా కీలకమైన ప్రదేశాల్లో ఉన్నాయి. మొత్తానికి అయితే ఇప్పుడు కడపలో మద్యం సిండికేట్ హాట్‌టాపిక్‌గా మారింది.

గండికోటలో సండే.. సందడి

- కిక్కిరిసిన పర్యాటకులు



జుమ్మా మసీదు ప్రాంగణంలో పర్యాటకుల సందడి

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆదివారం సందడి నెలకొంది. శనివారం సాయంత్రం చేరుకున్న వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా కిక్కిరిశారు. కోట ప్రాంగణంలో, లోయ ప్రాంతం వద్ద పర్యాటకులు ఫోజులిచ్చి తమ సెల్‌ఫోన్‌లో చిత్రాలను బంధించారు. అలాగే ఆదివారం సెలవు రోజు కావడంతో బెంగుళూరు, చెన్నై, అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. శని, ఆదివారాల్లో వ్యాపారస్థులకు, లాడ్జీలకు మంచి గిరాకీ లభించింది. కాగా శనివారం సాయంత్రం హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి గండికోటకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల వరకు గండికోటలో వివిధ కట్టడాలు సందర్శించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు అర్బన్ పోలీసులు, సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, వారి సిబ్బందితో పాటు మరికొందరు న్యాయవాదులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిలువుటద్దం క్రిష్ణారెడ్డి

- హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసరెడ్డి



క్రిష్ణారెడ్డి చిత్రపటాన్ని ఆవిష్కరించిన హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కోర్టులో నీతి, నిజాయితీకి నిలువుటద్దంగా సీనియర్ న్యాయవాది స్వర్గీయ క్రిష్ణారెడ్డి పనిచేశారని హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఆదివారం ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 64 ఏళ్ల న్యాయవాదిగా క్రిష్ణారెడ్డి అందించిన న్యాయ సేవలకు గుర్తుగా ఆయన చిత్రపటాన్ని హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసులరెడ్డి ఆవిష్కరించారు. క్రిష్ణారెడ్డితో పాటు న్యాయవాది గంగిరెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో సామాన్యునికి కూడా న్యాయం జరగాలంటే నిజాయితీ పరులైన న్యాయవాదులు అవసరమన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎందరో న్యాయవాదులకు క్రిష్ణారెడ్డి జీవితం ఆదర్శనీయమన్నారు. క్రిష్ణారెడ్డి మనువడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆయన నేర్పిన క్రమశిక్షణతోనే మంచి స్థాయికి ఎదిగామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామచంద్రారెడ్డి, సీనియర్ న్యాయవాదులు దాదాహయాత్, ఈవీ సుధాకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కొండారెడ్డి, రఘునాథరెడ్డిలతో పాటు పెద్దఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మి రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, అభిషేకాలను చేసి అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. భక్తులకు ఆలయ సిబ్బంది వసతులను కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ రాజన్ననాయుడు, ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

7

కుంగిన బ్రిడ్జి

- పట్టించుకోని అధికారులు



7

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- 23.5 కేజీల గంజాయి, 1620 మత్తు ట్యాబ్లెట్లు స్వాధీనం
- మోటారు వాహనచట్టం ఉల్లంఘించిన వారిపై 6527 కేసులు నమోదు
- రూ.16,16,515 జరిమానా
- ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్


కడప క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. జిల్లాలో నవంబరు నెలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీసుశాఖ జరిపిన దాడుల వివరాలను ఎస్పీ ఆదివారం వెల్లడించారు. గంజాయి విక్రయాలపై విస్తృత దాడులు నిర్వహించి 23.5 కిలోల గంజాయి, 1620 మత్తు కలిగించే మాత్రలు స్వాధీనం చేసుకుని 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అలాగే డ్రోన్ కెమెరాలతో కడప నగరంలోని చుట్టుపక్కల పట్టణాల్లో పాడుబడ్డ భవనాల్లో బహిరంగ ప్రదేశాలు, ఇతర గంజాయి, మత్తు పదార్థాలు సేవించిన హాట్‌స్పాట్స్ గుర్తించి 180 ప్రదేశాల్లో అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా ఈగల్ నార్కోటిక్ కంట్రోల్ సెల్, పోలీసు అధికారులు సంయుక్తంగా నిఘా ఉంచుతూ దాడులు చేస్తున్నారు. స్కూళ్లు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్‌కు పాల్పడుతున్న 8 మందిని అరెస్టు చేసి రూ.16,84,000 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదమాడుతున్న మొత్తం 222 మందిని అరెస్టు చేసి రూ.5,93,150, మట్కా నిర్వాహకులపై దాడులు చేసి 19 మందిని అరెస్టు చేసి రూ.64,520 నగదు, కోడిపందేలు ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి జిల్లాలోని ఐదు పోలీసు సబ్ డివిజన్లలో 580 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ చేస్తున్న 200 మంది మైనర్ల ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్న వారికి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 81 మందిపై కేసులు నమోదు చేసి రూ.93,585 జరిమానా విధించారు. సైలెన్సర్లు తీసివేసి అధిక శబ్దాలతో వాహనాలు నడుపుతున్న 100 మందికి పైగా వారి సైలెన్సర్లను రోడ్డు రోలర్ ద్వారా ధ్వంసం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 149 మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో మొత్తం వాహనదారులకు 6527 కేసులు నమోదు చేసి రూ.16,16,515 జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

జాలువారుతున్న జలం

- పర్యాటకులను కనువిందు చేస్తున్న జలపాతాలు

వెలుగొండ, శేషాచలం, పెనుశిల, పాలకొండల్లో జలం జాలువారుతోంది. ఇది పర్యాటకులను కనువిందు చేస్తోంది. రైల్వేకోడూరు మండలంలోని బాలుపల్లె అడవుల వద్ద జలపాతాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. తిరుపతికి కార్లు, బైక్‌లలో వెళ్లే వారు ఇక్కడ ఆగి నీటిలో దిగి ఫొటోలు తీసుకుంటూ మురిసి పోతున్నారు. అడవుల్లో ఎక్కడ పట్టినా జలంతో నిండి ఉండడంతో పచ్చదనం ఉట్టిపడుతోంది.

- రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)



రైల్వేకోడూరు మండలం బాలపల్లె వద్ద గంగమ్మ పరవళ్లు

వివాహిత అనుమానాస్పద మృతి

- తలకు బలమైన గాయాలు
- భర్తే చంపి ఉండవచ్చన్న అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

7

మృతిచెందిన వివాహిత సుజాత



సీఎం రమేశ్ ఇంటికి ప్రముఖులు

పరామర్శించిన కేంద్ర మంత్రి, పలు రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు ● నేడు రత్నమ్మ పెద్దకర్మ



ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కమలేశ్ పాశ్వాన్, ఇతర ఎంపీలు



నివాళులర్పిస్తున్న తెలంగాణమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ లావు కృష్ణదేవరాయులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ, రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్‌ను కేంద్ర రూరల్ డెవలప్‌మెంట్ మంత్రి కమలేశ్ పాశ్వాన్, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు ఆదివారం పోట్లదుర్తిలో పరామర్శించారు. ఇందులో భాగంగా చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి కేంద్ర మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం రమేశ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి, రత్నమ్మ మరణం పట్ల సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఢిల్లీ మంత్రి పర్వేష్‌వర్మ, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తమిళనాడు జౌళి, చేనేత శాఖ మంత్రి ఆర్‌కే గాంధీ, ఎంపీలు పుట్టా మహేశ్‌యాదవ్ (ఏలూరు), లావు క్రిష్ణదేవరాయలు (నరసరావుపేట), రఘునందన్‌రావు (మెదక్), నిషికాంత్ దూబే (ఝార్ఖండ్), అనుకాంత్ దూబే, రాహుల్ కస్వాన్ (రాజస్థాన్), బోలాసింగ్ (యూపీ), సంజయ్ జైస్వాల్ (బిహార్), నీరజ్‌శేఖర్ (రాజస్థాన్), సతీష్ గౌతం (యూపీ), శ్రీకాంత్ షిండే (మహారాష్ట్ర), సుప్రియసులే (మహారాష్ట్ర), జీఎంఆర్ అధినేత జీబీఎస్ రాజు, గ్రీన్‌కో కన్‌స్ట్రక్షన్ అనిల్, త్రివేణి కన్‌స్ట్రక్షన్ ప్రభాకర్, మాజీ ఎంపీ సంజీవ్‌బాల్యన్, దీపక్‌సింగ్, జూబ్లిహిల్స్ బీజేపీ నాయకుడు లంకల దీపక్‌రెడ్డి, మహారాష్ట్ర టీటీడీ బోర్డు మెంబర్ సౌరబ్‌బోరా, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తదితరులు పాల్గొన్నారు. వీరు సీఎం రమేశ్, సీఎం సురేశ్, సీఎం రాజేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా నేడు పోట్లదుర్తిలో జరిగే పెద్దకర్మ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితతో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు, ప్రముఖులు రానున్నట్లు సమాచారం.

బీమా సొమ్ము స్వాహా..!



- పంటల పరిహారంలో చేతివాటం
- రైతుల కంటే అధికారులకే లబ్ధి
- గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు
- విచారణ జరిపితే వెలుగులోకి

పంటలు సాగు చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు అందించే పంటల బీమా పరిహారంలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో వేర్వేరుగా సాగు చేసిన పంటలకు బీమా పరిహారం అందజేస్తారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వల్ల పంట నష్టపోయిన రైతన్నలకు సమగ్ర బీమా రక్షణ, ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. పంటల వారీగా రైతులు బీమా కోసం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా రెతులు చెల్లించే ప్రీమియం కంటే మరింత ఎక్కువ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తున్నారు. ఈ బీమా సొమ్మును కొందరు అధికారులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. విచారణ జరిపితే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం వుంది.

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉచిత పంటల బీమా పేరుతో ప్రీమియాన్ని ప్రభుత్వమే రైతుల తరపున చెల్లించే పథకం అమలు చేశారు. ఈ సమయంలో రైతుల్లో అవగాహన తీసుకువచ్చి ప్రీమియం చెల్లింపులకు ప్రోత్సహించాల్సిన అధికారులు ఇదే అదనుగా భావించి స్వాహా పర్వానికి తెర తీశారు. చాలా చోట్ల అసలు పంటలు సాగు చేయకున్నా మాయ చేసి పరిహారం భాగాలు చేసుకుని పంచుకున్నారనేది సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు పంటల బీమా ఇబ్బడి ముబ్బడిగా విడుదలైన సందర్భం ఉంది. 2019 ఖరీఫ్‌లో లక్షా 540 మంది లబ్ధిదారులకు రూ.350 కోట్లు బీమా మంజూరైంది. 2020 ఖరీఫ్‌లో 26,428 మందికి రూ.55 కోట్లు, 2021 ఖరీఫ్‌లో 9,0553 మందికి రూ.286 కోట్లు, 2002లో 76,753 మందికి 203 కోట్లు మంజూరైంది. ఇందులో అధిక భాగం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల పంట వేయని వారికి, రియల్ ఎస్టేట్ వ్యాపారుల బీడు భూములకు కూడా లక్షలాది రూపాయలు పరిహారం కింద జమ అయినట్లు తెలుస్తోంది. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన నిజమైన రైతుల పేర్లు జాబితాలో నుంచి తొలగించడంతో చాలా మందికి పరిహారం అందనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈక్రాప్ నమోదు, సాంకేతిక లోపాల కారణంగా కూడా అర్హులైన రైతులు బీమా పరిధిలోకి రాకుండా నష్టపోయిన పరిస్థితులు ఉన్నాయి.

పులివెందుల ప్రాంతంలోనే ఎక్కువగా...

గత ప్రభుత్వ హయాంలో పులివెందుల నియోజకవర్గంలో పంటల బీమాలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ కొన్ని బ్యాంకుల్లోని అధికారులు రైతుల పేర్లతో వారికి తెలియకుండానే సొంతంగా బీమా చెల్లించి పరిహారం డబ్బులు వచ్చిన తరువాత స్వాహా చేసినట్లు సమాచారం. ఇందులో వ్యవసాయానికి అనుబంధమైన ఓ బ్యాంకులో ఉన్న అధికారి ఒకరు కొన్ని కోట్ల రూపాయలు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను పొందిన లబ్ధి నుంచి కొంత మేర తమ బ్యాంకుకు సంబంధించిన ఉన్నతాధికారులకు సైతం పర్సంటేజీల రూపంలో చెల్లించారనే చర్చ సాగుతుంది.

ఖాజీపేట మండలం మిడుతూరులో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది కొందరు పంటల బీమా పొందడం కోసం వక్రమార్గాన్ని తొక్కారని వెలుగులోకి వచ్చింది. అయితే ఇక్కడ జరిగిన అక్రమాల్లో కేవలం ఒకరిద్దరి పైనే చర్యలు తీసుకోవడం.. మిగిలిన వారిని వదిలివేయడంతో దొరికినోడు దొంగ, దొరకనోడు దొర.. అనే పరిస్థితులున్నాయి. మిడుతూరు సచివాలయ పరిధిలో 2020-21లో వరికి పంటల బీమా మంజూరైంది. ఈ క్రమంలో రైతుల పేర్లు మ్యాచ్ కాకపోవడంతో విచ్చలవిడిగా వ్యవసాయాధికారులే కోట్లాది రూపాయలు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. నాట్ మ్యాచ్, మ్యాచ్ జాబితాలను సమగ్రంగా విచారించినట్లయితే గతంలో జరిగిన అక్రమాలు వెలుగు చూసే అవకాశాలు లేకపోలేదు. ఒక్క మిడుతూరు గ్రామ సచివాలయాల పరిధిలోనే ఒక ఉద్యోగి పది ఆధార్ కార్డులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చారు. మరో ఉద్యోగి తమ అనుయాయులు, కుటుంబీకుల పేర్లతో పరిహారాన్ని పొందినట్లు తెలుస్తోంది. వీరపునాయునిపల్లె, పులివెందుల, బి.మఠం, ఖాజీపేట, ప్రొద్దుటూరు తదితర మండలాల్లో పంటల బీమా పరిహారం పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలు స్తోంది. అధికార యంత్రాంగం సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రనాయక్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. అది ఎప్పుడో జరిగిందన్నారు. రైతుల నుంచి సైతం తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

కోడిపందాలపై పోలీసు దాడి

● వాహనాలు సహా నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి పంచాయతీలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న కోడిపందాలపై పోలీసులు ఆదివారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విష్ణునారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● విస్తృతంగా గాలింపు చర్యలు


మృతి చెందిన నారాయణ

సిద్దవటం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పొలాలకు కాపలాదారుగా పనిచేస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి భార్య రత్నమ్మ కథనం మేరకు... మండలంలోని జవుకులపల్లికి చెందిన నారాయణ (45) కడప-చెన్నై జాతీయ రహదారి చర్చి పక్కన ఉన్న పొలంలో కాపలాదారుగా పనిచేస్తూ కుటుంబంతో కలసి అక్కడే నివాసముంటున్నాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవపడంతో పాటు దాడికి యత్నించడంతో ఆమె బాకరాపేటకు పారిపోయింది. ఆదివారం ఆమె తిరిగి వచ్చేసరికి భర్త మృతి చెంది కనిపించాడు. దీంతో ఆమె బంధువులకు సమాచారమిచ్చింది. సమాచారం అందుకున్న ఒంటిమిట్ట సీఐ నరసింహరాజు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతదేహం నుదిటిపై రక్త గాయం ఉండడంతో కడప నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేశారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, క్లూస్‌టీమ్ ఇన్‌స్పెక్టర్ రుక్మిణిదేవి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య


మృతి చెందిన వెంకటలక్ష్మమ్మ (ఫైల్‌ఫొటో)

సిద్దవటం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్న కుటుంబానికి భారం కాకూడదని ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మేనల్లుడు కుప్పాల వెంకటసుబ్బయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ పాలకొండ్రాయుని పల్లెకు చెందిన పెద్ద వెంకటలక్ష్మమ్మ (63) భర్త చనిపోవడంతో తన అన్న కుటుంబంతో కలసి నివాసముంటోంది. కొద్ది రోజులుగా ఆమె పక్షవాతంతో బాధపడుతుండడంతో అన్న కుటుంబసభ్యులు అప్పులు చేసి ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. దీంతో వారి కుటుంబానికి భారం కాకూడదన్న ఉద్దేశంతో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఆమె వాంతులు చేసుకుంటూ కనిపించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు ఏమైందని ప్రశ్నించగా పురుగులమందు తాగానని చెప్పడంతో వెంటనే 108వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఏఎస్‌ఐ బాబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గండికోటలో అభివృద్ధి పనులు ప్రారంభం


గండికోటలో జరుగుతున్న రోడ్డు పనులు

జమ్మలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గండికోటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించి ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించి టాస్కీ నిధులు దాదాపు రూ.79 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వెళ్లారు. తర్వాత సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా గొడవ చోటుచేసుకుని ఇటీవల సద్దుమణిగింది. ఈ క్రమంలో వేరే కాంట్రాక్టర్ గండికోటలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆదివారం కోట ఎదురుగా లోయ ప్రాంతానికి వెళ్లే దారి, అక్కడి నుంచి గుర్రపుశాల వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. గతంలో ఎనిమిది అడుగుల రోడ్డు ఉండేదని, మళ్లీ ఎనిమిది అడుగులకు పైగా కొలతలు వేశారు. ఈ మేరకు మట్టి చదును పనులు జరుగుతున్నాయి.

కుంగిన బ్రిడ్జి



● పట్టించుకోని అధికారులు

● భయాందోళనలో తల్లిదండ్రులు, విద్యార్థులు

ఒంటిమిట్ట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న బ్రిడ్జి కుంగిపోయింది. దీంతో ఆ బ్రిడ్జిపై వెళ్లాలంటే అక్కడి ప్రజలు భయపడుతున్నారు. కడప-చెన్నై ప్రధాన రహదారి నుంచి ఈ గ్రామానికి వెళ్లేందుకు తారురోడ్డు నిర్మించారు. మార్గమధ్యంలో ఒక బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి ఇరువైపులా కుంగిపోవడంతో ఈ గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెర్లోపల్లె నుంచి ఒంటిమిట్ట, కొత్తమాధవరం, మంటపంపల్లె గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు ఇక్కడి విద్యార్థులు వెళుతున్నారు. ఈ క్రమంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు స్కూలుకు వెళ్లి ఇంటికి వచ్చిన పిల్లలను చూస్తేగాని వారి భయం పోవడంలేదు. ఇలా ఎన్నిరోజులు భయపడుతూ తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే బ్రిడ్జిపై వెళ్లాల్సిందే. మరో మార్గం లేదు. ప్రతిరోజు ఈ గ్రామ ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఒంటిమిట్ట, కడప, రాజంపేటకు వెళుతూ ఉంటారు. ట్రాక్టర్లు, కార్లు, పలు స్కూటర్లు ఈ బ్రిడ్జిపైనే వెళుతుంటాయి. బ్రిడ్జి కుంగిపోయి 10 రోజులు కావస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ నాగరాజు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఈఈతో కలిసి బ్రిడ్జిని పరిశీలించామన్నారు. బ్రిడ్జి వద్ద నిదానంగా వెళ్లాలనే బోర్డును ఏర్పాటు చేయాలని సర్పంచ్‌కు తెలిపామని, త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు.

పిల్లలతో భయపడుతున్నాం..



ప్రతిరోజు పిల్లలు పాఠశాలకు వెళుతున్నారు. ఈ బ్రిడ్జిపై పాఠశాలకు వెళ్లాల్సి రావడంతో భయపడుతున్నాం. వారు ఇంటికి వచ్చేవరకు భయంభయంగానే కాలం గడుపుతున్నాం. అధికారులు త్వరగా స్పందించాలి.

- ప్రతాప్‌రెడ్డి, చెర్లోపల్లె, ఒంటిమిట్ట

త్వరగా మరమ్మతులు చేయాలి..



మా గ్రామానికి వెళ్లే బ్రిడ్జి కుంగిపోయింది. దీంతో భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజులు గడిచే కొద్ది బ్రిడ్జి పూర్తిగా కూలిపోయే అవకాశం ఉంది. అధికారులు త్వరగా మరమ్మతులు చేయాలి.

- రాజారెడ్డి, చెర్లోపల్లె, ఒంటిమిట్ట


కుంగిపోయి నెర్రెలు చీలిన బ్రిడ్జి

వివాహిత అనుమానాస్పద మృతి

● తలకు బలమైన గాయాలు

● భర్తే చంపి ఉండవచ్చన్న అనుమానాలు


● దర్యాప్తు చేస్తున్న పోలీసులు


మృతి చెందిన సుజాత

ప్రొద్దుటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి వద్ద గౌరు సుజాత (42) అనే వివాహిత ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల మేరకు... చాపాడు మండలం రాజువారి పేటకు చెందిన గౌరు సుజాతకు 2010లో ప్రొద్దుటూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన రవికుమార్‌రెడ్డితో వివాహమైంది. రవికుమార్‌రెడ్డికి శంకరాపురంలో వ్యవసాయ పొలం వుంది. వివాహం అయ్యాక మైదుకూరు రోడ్డులోని టీచర్స్‌కాలనీలో వుండేవారు. వ్యవసాయంతో పాటు ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఇటీవలే మూడు నెలల క్రితం బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఓ ఇంటిలో చేరారు. ఇటీవల రవికుమార్ ఆరోగ్యం సరిగాలేక పని చేయలేక ఇంట్లోనే ఖాళీగా వుంటున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రవికుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులోనే వుంటున్న సుజాత సోదరికి ఫోన్ చేసి సుజాత మరణించిందనే సమాచారమిచ్చాడు. దీంతో సుజాత బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో మంచం వద్ద రక్తపుమడుగులో సుజాత నిర్జీవంగా పడివుంది. క్లూస్ టీం పరిశీలించింది. తలకు బలమైన గాయంతో ఆమె మరణించి వుంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి భర్త రవికుమార్‌పై కూడా బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది హత్య లేదా ప్రమాదమా అనేదానిపై పోలీసులు విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

● ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్


బోల్తా పడిన జిప్సం టిప్పర్

ముద్దనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును జిప్సం లోడు తీసుకొని వస్తున్న టిప్పర్ ఢీకొని బోల్తా పడింది. ఆదివారం రాత్రి ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేదు. స్థానికుల సమాచారం మేరకు... నంద్యాల నుంచి ముద్దనూరులోని మనగ్రోమోర్‌కు జిప్సం లోడు తీసుకువస్తున్న టిప్పర్ జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో బ్రేక్ ఎయిర్ ట్యాంక్ పగిలిపోవడంతో టిప్పర్ అదుపు తప్పింది. దీంతో అతివేగంగా టిప్పర్ ఘాట్ రోడ్డులో వస్తోంది. ముద్దనూరు టౌన్ నుంచి జమ్మలమడుగుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు శివాలయం వద్దనున్న కాయన వంక మీదుగా వస్తుండగా టిప్పర్ డ్రైవర్ మనోహర్ కేకలు వేసుకుంటూ వచ్చాడు. అరుపులు విన్న వాహనచోదకులు శివాలయం ముందు నిలిచి ఉన్న పెళ్లి బృందం ఐచర్ వాహనం ముందుకు వెళ్లిపోయింది. ఎదురుగా వెళుతున్న ఆర్టీసీ బస్సును రోడ్‌సైడు నిలిపివేశాడు. ఈ క్రమంలో బస్సును తప్పించబోయి టిప్పర్ డ్రైవర్ బస్సును కుడివైపు రాచుకుంటూ వెళ్లడంతో టిప్పర్ బోల్తా పడింది. ఆర్టీసీ బస్సు అద్దం పగిపోయింది. అప్పటికి బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. టిప్పర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పెళ్లి బృందం ఐచర్ వాహనం, బస్సును ఢీకొన్నా ప్రాణనష్టం జరిగి ఉండేది. కేవలం నేషనల్ హైవే అధికారులు బైపాస్ రోడ్డు ఏర్పాటులో భారీ తప్పిదం చేశారని, ఘాట్ రోడ్డు నుంచి నేరుగా ముద్దనూరు టౌన్‌లోకి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి 6 లారీ ప్రమాదాలు జరిగి టౌన్‌లోని ఇళ్ల యజమానులకు భారీ నష్టం వాటిల్లింది. గతంలో నేషనల్, హైవే అధికారులకు, కలెక్టర్ దృష్టికి బాధితులు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసక్తికరంగా క్రికెట్ మ్యాచ్‌లు


లిఖిత్ ఇరగంరెడ్డి (96పరుగులు)


ఐదు వికెట్లు సాధించిన చాణక్య సాయి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏపీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండురోజుల క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం ఆసక్తికరంగా సాగుతున్నాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 300పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. చరణ్‌తేజ్ 70పరుగులు, యాసిన్ సిద్దిక్ 53 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి ఐదు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 12పరుగులు చేసింది. దీంతో మరో 288 పరుగుల వెనకంజలో ఎదురీదుతోంది.

కేవోఆర్ఎం మైదానంలో...

నగర శివారులో ఉన్న కేవోఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, నార్త్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 179 పరుగులకు కుప్పకూలింది. ఏవీ చరణ్ 53 పరుగులు చేశాడు. కాగా బౌలింగ్ విభాగంలో నార్త్ జోన్ విన్నర్స్ జట్టు బౌలర్ చాణక్యసాయి 5వికెట్లు పడగొట్టారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మరో 149 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది. కాగా బౌలింగ్ విభాగంలో బౌలర్ చాణక్యసాయి 5 వికెట్లు పడగొట్టారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో...

నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో సౌత్ జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన సౌత్ జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికట్లు కోల్పోయి 251 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో లిఖిత్ ఇరగంరెడ్డి 96 పరుగులు, ప్రణవ్ గోవర్ధన్ 65 పరుగులు చేశారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో1 వికెట్ నష్టపోయి 39 పరుగులు చేసింది. దీంతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మరో 212 పరుగుల వెనుకంజలో ఎదురీదుతుంది.

లారీ కింద పడి వ్యక్తికి తీవ్రగాయాలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణా సినిమా థియేటర్ సమీపంలో ప్రధానదారిపై ఆదివారం రాత్రి లారీ కింద పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని గ్రామ పంచాయతీ కాలనీకి చెందిన పారిశుధ్య కార్మికుడు వెంకటేష్ ప్రధానదారి దాటి ఇంటికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ కింద పడి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రక్తస్రావం ఎక్కువగా ఉండడంతో వైద్యులు తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు


అయ్యప్పస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో పెన్నానది ఒడ్డున వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం, శనివారం అంబలం పూజ నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం కూడా అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివాస గృహం వీధి, పాతూరు గ్రామంలో నివాసం ఉంటున్న సూరే వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఈ పూజా కార్యక్రమానికి మండలంలోని అయ్యప్పస్వాములంతా పాల్గొని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అయ్యప్పస్వామికి కాయకర్పూరం సమర్పించారు. అనరంతరం అయ్యప్పస్వాములు, ప్రజలకు, భక్తులకు ప్రసాదాన్ని అందించారు.


అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న భక్తులు

రాష్ట్ర స్థాయి టాంగ్-థా పోటీలకు 36 మంది ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

పరవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరవాడ ఇండోర్ స్టేడియంలో టాంగ్-థా అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఏడు జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆద్యంతం పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం.నాయుడు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి టాంగ్-థా పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎంవీ.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి అచ్చెమ్మ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు శ్రీహరిరాజు, ఏపీడీ ప్రసాద్, నాయుడు, ప్రతినిధులు జి.రాజు, ఎ.నూకరాజు, ఎస్.శ్రీనివాస్, పి.లక్ష్మి పాల్గొన్నారు.

సాయం చేయకపోతే నిరసన చేస్తాం

● రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ



మాట్లాడుతున్న ఏవీ రమణ

మైదుకూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటకు ప్రభుత్వం ప్రకటించిన రూ.50వేల సాయాన్ని వెంటనే విడుదల చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ డిమాండు చేశారు. స్థానిక కృష్ణపురం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో రమణ మాట్లాడుతూ కడప, కర్నూల్ జిల్లాలో కురిసిన అధిక వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంటకు రాష్ట్ర ప్రభుత్వం 50 వేల రూపాయలను సాయం అందిస్తాని ప్రకటించి రెండు నెలలు అవుతోందన్నారు. ఇంతవరకు నిధులను విడుదల చేయలేదని డిమాండు చేశారు. వెంటనే విడుదల చేయని పక్షంలో ఈనెల 15వ తేదిన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చొక్కం సంజీవరాయుడు, కూశెట్టి పుల్లయ్య, బీఎల్ రామ్మోహన్, కొండయ్య, భూమిరెడ్డి కొండారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి చలి.. ఉదయం పొగ మంచు..

● ప్రజల ఇక్కట్లు

ఓబులవారిపల్లె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల నుంచి ప్రజలు తేరుకోకమునుపే చలి, పొగమంచుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో తీవ్రమైన చలి భయపెడుతోంది. తెల్లవారితే పొగమంచుతో ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు కూడా పొగమంచు వీడకపోవడంతో ప్యాసింజర్ రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రజలు రాత్రివేళ చలితో, పగటిపూట పొగమంచుతో పనులు ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు.


ఉదయం 7.30 గంటల సమయంలో పూర్తిగా పొగమంచు ఉన్న దృశ్యం

భయమేస్తోంది..!

- పట్ట కప్పితే తప్ప పనికిరాని వైనం
- పెచ్చులూడి పడుతున్న పైకప్పు
- విధుల నిర్వహణకు జంకుతున్న సిబ్బంది
- దశాబ్దాలు గడుస్తున్నా అధ్వాన స్థితిలో కేసీ కెనాల్ సెక్షన్ భవనం



వర్షానికి నీరుకారకుండా కేసీ కెనాల్ భవనానికి పట్ట కప్పిన వైనం, పెచ్చులూడుతున్న పైకప్పు అంచులు (అంతర చిత్రం)

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వర్షం కురిసిందంటే కేసీ కెనాల్ నీటిపారుదల భవనం కారుతుంది. ఎప్పుడో 70 ఏళ్లనాడు నిర్మించిన ఈ భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంటున్నా కొత్త భవనం నిర్మించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీంతో నీటిపారుదలశాఖ నుంచి నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైనవారంతా ఈ భవనం దుస్థితి చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటి ఛైర్మన్ సైతం ఇంత పెద్ద నీటిపారుదల శాఖకు ఇలాంటి భవనం ఏమిటి, దీంట్లో కూర్చుంటే పెచ్చులూడితే మా పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం చూసిన వారికి ఎవరికైనా నీటిపారుదలశాఖకు ఇలాంటి భవనం ఏమిటి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరో కొద్దిరోజులు నిలువుగా కూలిపోతుంది కదా అని చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది. కడప నగరం చిలకలబావి సమీపంలో కేసీ కెనాల్ కడప సెక్షన్ భవనం ఉంది. దీని కింద ఐదుగురు నీటి సంఘాల అధ్యక్షుడు ఉన్నారు. వీరంతా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నా ఈ భవనంలోకి రావాలి. ఆ సమయంలో ఐదు నీటి సంఘాల అధ్యక్షులు ,వీరు ఎన్నుకున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, అసిస్టెంటు ఇంజనీరు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వీరు వచ్చి సమావేశం నిర్వహించుకుని వెళుతుంటారు. రైతులకు ఏదన్నా సమస్య వచ్చినా ఇక్కడికి వచ్చి సంబంధిత ఇంజనీరుతో మాట్లాడి వెళుతుంటారు. అయితే భవనం గేటు వరకు వచ్చిన వారు భవన పరిస్థితి చూసి లోపలికి మాత్రం అడుగు పెట్టడంలేదు. ఎప్పుడు ఏమవుతుందో, పైకప్పు పెచ్చులూడి మీద పడతాయోనని భయపడుతుంటారు. దీంతో కేసీకెనాల్ కార్యాలయానికి వచ్చిన వారు లోపలున్న సిబ్బందిని, అసిస్టెంటు ఇంజనీరును బయటికి పిలిచి బయటనే మాట్లాడి వెళుతుంటారు. అక్కడ సిబ్బంది లోపలికి రమ్మన్నా అడుగు పెట్టరు. ఎందుకంటే భవనం పరిస్థితి అలా ఉంది మరి.

వర్షానికి కారకుండా పట్ట కప్పారు..: అసిస్టెంటు ఇంజనీరు, కడప సెక్షన్ కార్యాలయం అడపాదడపా కురిసే వర్షాలతో ఉరుస్తుండడం, మరో పక్క పెచ్చులూడిపడుతుండడంతో బయపడ్డ కార్యాలయ సిబ్బంది పెద్ద నిలువు పట్టను పైకప్పు నుంచి కింద వరకు కప్పిపెట్టారు. దూరం నుంచి ఎవరైనా చూస్తే ఇదేదో పెళ్లికి తీసుకువచ్చిన షామియానాల కనిపిస్తుంది. తీరా దగ్గరికి వెళ్లి చూస్తే ఇదేంది కార్యాలయానికి ప్లాస్టిక్ పట్ట కప్పారేంటని ముక్కున వేలేసుకుని చూసి వెళుతున్నారు.

అంచనాలు తయారు చేసి పంపాం

కొత్త భవనాల కోసం అంచనాలు తయారు చేసి పంపాం. భవనం దాదాపు 70 సంవత్సరాలయి నట్లుగా ఉంది. అయితే కొత్త భవనం కావాలని ఇటీవల మూడు నెలల క్రితం అంచనాలు వేసి పంపాం. ఇంత వరకు దాని పరిస్థితి తెలియలేదు. పై అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకుని కొత్త భవనం మంజూరు చేయాలి. అంత వరకు నీరు కారుతున్నా, పెచ్చులూడి పోతున్నా భవనంలోనే మేము ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. బయటికి వెళ్లి ఆఫీసు పని చేయలేం కదా, ఎలాగోలా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నాం.

● గంగిరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీరు, కేసీ కెనాల్ , కడప సెక్షన్

వినాయకనగర్‌లో ట్రాఫిక్ జామ్

ఓ షాపింగ్ మాల్ నిర్వాహకులకు

పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని కడప తాలూకా పోలీసుల సూచన



కడప క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని విజయదుర్గ టెంపుల్, వినాయక నగర్ సమీపంలో ఇటీవల నూతనంగా ఏర్పాటైన షాపింగ్ మాల్ వద్ద ట్రాఫిక్ జామ్ అధికం కావడంతో వాహనదారులు సమస్యను పోలీసు శాఖ దృష్టికి తెచ్చారు. స్పందించిన తాలుకా సీఐ టి.రెడ్డప్ప సిబ్బందితో వెళ్లి తరచూ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కావడం వల్ల అంబులెన్స్‌లు, ఇతర వాహనాలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని షాపింగ్ మాల్ ఆవరణలో వాహనాలు నిలుపుకునేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కడప తాలుకా సీఐ టి.రెడ్డప్ప సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి వినతి


ముఖ్యమంత్రికి సమస్యలు విన్నవిస్తున్న పార్థసారథిరెడ్డి

వేముల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో నెలకొన్న పలుసమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి విన్నవించారు. ఆదివారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్థసారథిరెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. సమస్యలు వివరించి అర్జీ సమర్పించారు. సమస్యలను విన్న ముఖ్యమంత్రి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేసినట్లు పార్థసారథిరెడ్డి తెలిపారు.

ప్రజలలో చైతన్యం కోసం చేస్తున్న కృషి ఉన్నతమైంది



నల్లపురెడ్డిపల్లె పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమంలో విద్యార్థులు

పులివెందుల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేస్తూ స్థానిక ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు చేస్తున్న కృషి ఉన్నతమైనదని యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ క్యాంప్ కో- ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, ఏపీఎం అంజనేయులు కొనియాడారు. ఆదివారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పులివెందుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు హాజరై విద్యార్థులను అభినందించి వారితో కలిసిమొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలనారాయణ, ఎంపీపీ వరలక్ష్మి, గ్రామ సర్పంచు మౌనిక, డిష్ వెంకటరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా గడువు పెంచండి

వేంపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రబీసీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా గడువు పెంచాలని వైసీపీ కడప జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ముత్తుకూరు మస్తాన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో అధికంగా రబీలో బుడ్డశనగ, మినుము, నువ్వులు,జొన్న, వేరుశనగ పంటలుసాగు చేశారన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా డిసెంబరు 15లోపు రైతులుప్రీమియం చెల్లించాలని జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారన్నారు.కానీరైతులు ఆర్బీకేకి వెళ్తే అక్కడ అధికారులు మాకు షోయింగ్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు పైఅధికారులు ఇంకాచెప్పడం లేదని తెలిపారు. ఇంకా వారం రోజులు గడువు మాత్రమే ఉందన్నారు. జిల్లాలో రైతులు అన్నిపంటలు వేశారని, వారం రోజుల్లో ఎలాసాధ్యమవుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. జనవరి 10 వరకు గడువు పెంచాలని కోరారు.

ఐదేళ్లలో వైసీపీ చేసిన అభివృద్ధి ఏంటి...?

కమలాపురం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లలో వైసీపీ నాయకులకు ప్రజలు అధికారం కట్టబెడితే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వైసీపీ నాయకులు రోడ్లంతా గుంతలు ఉన్నాయి, పూడ్చాలని నిరసన తెలపడం సిగ్గుచేటన్నారు. వారికి ఐదేళ్ల పరిపాలన ఇస్తే కమలాపురం అభివృద్ధికి ఏమైనా పనిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కంకర సుబ్బారెడ్డి,, చిన్నసుబ్బారెడ్డి ప్రసాద్‌రెడ్డి, గండి నారాయణ పాల్గొన్నారు.

విశ్వవ్యాప్తం వేమన కీర్తి

కడప కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేమన కీర్తి విశ్వవ్యాప్తమని రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. జనవరిలో నిర్వహించబోయే వేమన జయంతి సందర్భంగా కడప రెడ్డి సేవా సమితి వారు ఆదివారం ఉదయం సేవా సమితి ప్రాంగణంలో ఐదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వేమన పద్యపఠన పోటీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 150 మందికి పైగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా వీరిలో 32 మందిని ఎంపిక చేశారు. తరువాత 21న జరిగే పోటీల్లో వీరిలో ముగ్గురుని మాత్రమే విజేతలుగా ప్రకటించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కుప్పిరెడ్డి నాగిరెడ్డి కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి , ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణం చెల్లించాలి : ఆర్ఎస్‌యూ



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణం విడుదల చేయాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఆర్ఎస్‌యూ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రూ.6400కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పులివెందుల నియోజకవర్గ ఆర్ఎస్‌యూ అధ్యక్షుడిగా అశోక్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కష్టపడే వారికి కమిటీల్లో గుర్తింపు


మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కష్టపడే వారికే కమిటీల్లో స్థానాలు కల్పిస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష తెలిపారు. ఆదివారం కడపనగరం 14వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామకాన్ని ఆయన ప్రారంభించారు. సౌత్ జోన్ అధ్యక్షుడు ఐస్‌క్రీమ్‌రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజల మేలు కోసం చేపడుతున్న చర్యలను నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌లో దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూ రు పట్టణం జమ్మలమడుగు రోడ్డులోని నైట్‌షెల్టర్‌లో తల దాచుకునే పేదలకు శివపు రం వెంకటేశ్వర్లు ధర్మపత్ని మంజుశ్రీ కుమారుడు తరు ణ్‌కుమార్ రోటరీ దొంతు మురళీలు చలినుంచి రక్షణ కోసం దుప్పట్లు పంపిణీ చేశా రు. ఆదివారం రూరల్ డెవల ప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైట్‌షెల్టర్‌లో ఉన్న వారికి దుప్పట్లు అంద జేశారు. అలాగే విద్యార్థి అనాథ శరణాలయంలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గజ్జల వెంకటేశ్వర్లు, దొంతు మురళీ, బీసీ సమాఖ్య కార్యదర్శి బీవీ రాజు , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్మీ సాయుధ దళాల జెండా దినోత్సవం

బద్వేలు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశా లలో ఆదివారం ఆర్మీ సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేశ రక్షణకు పనిచేసిన ఆర్మీజనవాన్లను సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల పరిపాలనాధికారి సాయిక్రిష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న సాయుధ దళాలకు చెందిన సైనికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్లను కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఏఎన్ఓ లెఫ్టినెంట్ బాల ఓబు లేసు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు ఎస్ఐగా నాగకీర్తన

అట్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు ఎస్ఐగా నాగకీర్తన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అట్లూరు ఎస్ఐగా పనిచేసిన రామక్రిష్ణ కడప టూటౌ న్ పోలీసుస్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాజుపాలెం ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై అట్లూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ అయినట్లు ఆమె తెలిపారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తియాప్

కడప క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్ అని రిమ్స్ పీఎస్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఆదివారం సాయంత్రం నగర శివార్లలోని శిల్పారామం సందర్శకులకు ఎస్ఐ యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు, చిన్నారులు, మహిళలపై జరిగే నేరాల గురించి వివరించారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో అది ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

శ్మశాన సమస్యలపై 16న జాతీయ రహదారి దిగ్బంధం

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలంఖాన్‌పల్లె శ్మశాన, డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఈనెల 16వ తేదీన శ్మశానం వద్ద గల జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ పేర్కొన్నారు. ఆదివారం ఆలంఖాన్‌పల్లెలో సీపీఐ శాఖా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఏళ్లతరబడి శ్మశాన సమస్య జటిలంగా మారుతూ పరిసర ప్రాంత ప్రజానీకం డ్రైనేజీ, నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 16వ తేదీన శ్మశానంవద్ద జాతీయ రహదారి దిగ్బంధం చేపడుతామన్నారు.

వైవీయూ అక్రమాలపై విచారణ చేపట్టాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది నియామకాలపైన విచారణ ఆదేశాలు వచ్చాయని ఎందుకు చేపట్టలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ఒక ప్రకటనలో ఆరోపించారు. తక్షణం అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలన్నారు.

ఎస్టీయూ సమావేశాలను జయప్రదం చేయండి

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ 79వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాల ని సంఘం నేతలు పిలుపుని చ్చారు. జమ్మలమడుగు పట్టణంలో ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయ ప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నేత గురుకుమార్ మాట్లాడుతూ మొదటిసారిగా ఈనెల 13, 14 తేదీల్లో రీజియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనమండలి సభ్యుడు కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు, సీపీఐ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు కుండాభాస్కర్, రీజియన్ కన్వీనర్ మహ్మద్‌గౌస్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు

బద్వేలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తుల కు బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి తక్కువ ఛార్జీలతో బస్సులను ఏర్పాటు చేస్తున్నామ ని డిపో మేనేజరు నిరంజన్ ప్రకటనలో తెలిపారు. అధునాతన సూపర్ లగ్జరీ బస్సును అయ్యప్పస్వాములకు వీడియో సౌకర్యంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అతి తక్కువ ఛార్జీలతో బస్సును పంపుతున్నామని ఏడు మందికి ఉచిత ప్రయా ణం అందిస్తున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో బస్సు పర్మిట్ ఫీజు ఉండదని తెలిపారు. ఇతర వివరాలకు 9959225 779, 7382867104లను సంప్రదించాలని ఆయన కోరారు.

లింగాల ఎస్ఐగా జగదీశ్వర్‌రెడ్డి



లింగాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లింగాల నూతన ఎస్ఐగా జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలుచేపట్టారు. లింగాలలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న అనిల్ కుమార్ తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీఅయ్యారు. దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న జగదీశ్వర్‌రెడ్డి ఎస్ఐగా లింగాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

వల్లూరుకు శివనాగిరెడ్డి



వల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వల్లూరు ఎస్ఐగా పనిచేస్తున్నఎస్ఐ పెద్దఓబన్న కడప స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా తాళ్ల ప్రొద్దుటూరులో పనిచేస్తున్న శివనాగిరెడ్డి బదిలీపై వల్లూరుకు వచ్చారు. వల్లూరుకు వచ్చి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వల్లూరు మండలానికి సంబంధించిన విషయాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు.

విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు, ప్రజలకు మరింత చేరువ అవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు.

బదిర ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా బధిరుల ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ 2025-2028 సంవత్సరాల కోసం కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆదివారం కడప నగరం శంకరాపురం డాక్టర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియం, క్రీడాసాధికార సంస్థ సమావేశమందిరంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఎం.శివనాగసంతోష్, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎం.కొండయ్యరాజు, ఉపాధ్యక్షుడుగా పి.రాజశేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా డి.నరేంద్రరెడ్డి ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.భూప్రకాష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.జైహింద్‌రెడ్డి, ట్రెజరర్ ఎస్ మహేష్, మహిళా కార్యదర్శి ఎ.రెడ్డమ్మ, ఈసీసభ్యులుగా ఎస్.షబానా, కెవి సుబ్బారెడ్డి, ఎస్.గయాసుద్దీన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఎన్జీఓస్ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, ఎన్జీఓ ఎలక్షన్ ఆఫీసర్ సి.సిద్దయ్య, అసోసియేట్ ఎలక్షన్ ఆఫీసర్ వి.కుమార్, ఎన్నికల పరిశీలకుడు పి.నిత్యపూజయ్య, అలాగే ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యనాథేశ్వరునికి ప్రత్యేక పూజలు



వల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పరమశివుని నక్షత్రం ఆరుద్ర ఆదివారం రోజు కావడంతో మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని కామాక్షి సమేత వైద్యనాదేశ్వర ఆలయంలో వైద్యనాథేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వైద్యనాదేశ్వరునికి మహాన్యాస పూర్వన రుద్రాభిషేకాలు, విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను సుందరంగా ప్రత్యేక పూలు, పండ్లతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు కాయ కర్పూరం చెల్లించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వేంపల్లె..: వేంపల్లెలో శ్రీదుర్గా గవి మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా విశేషపూజలు జరిపించారు. ఆలయచైర్మన్ పినుపోలు రాఘవేంద్రప్రసాద్ మాట్లాడుతూ అర్చకుడు ప్రసాద్‌శర్మ నేతృత్వంలో గవి మల్లేశ్వరుడికి ఉదయాన్నే అభిషేకం ఇతర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించామన్నారు.

తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐగా అనిల్‌కుమార్



కొండాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐగా డి. అనిల్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేసిన ఎస్ఐ శివ నాగిరెడ్డి వల్లూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నియమితులయ్యారు. అనిల్‌కుమార్ లింగాల పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీ పై తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

అట్లూరు ఎస్ఐగా నాగకీర్తన



అట్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు ఎస్ఐగా నాగకీర్తన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అట్లూరు ఎస్ఐగా పనిచేసిన రామక్రిష్ణ కడప టూటౌన్ పోలీసుస్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాజుపాలెం ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై అట్లూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ అయినట్లు ఆమె తెలిపారు. బాధ్యతలు చేపట్టిన విషయం తెలుసుకున్న అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లిఖార్జునరెడ్డి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబరు ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మన్యంమహేశ్వర్‌రెడ్డి, యూనిట్ అధ్యక్షుడు అల్లం వెంకటసుబ్బయ్య జయక్రిష్ణ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందించారు. అట్లూరు మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జి రెడ్డప్పరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రాధాకృష్ణారెడ్డి,పెద్ద రామసుబ్బారెడ్డి, చిన్న రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరసింహులు, నవీన్‌రెడ్డిలు ఎస్ఐని సన్మానించారు.

బి.కోడూరు ఎస్ఐగా సూర్యనారాయణరెడ్డి



బి.కోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బి.కోడూరు మండల ఎస్ఐగా జి.సూర్యనారాయణరెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వీఎన్ పల్లె మండలం ట్రైనీ ఎస్ఐగా ఉంటూ మొదటి పోస్టింగ్ బి.కోడూరుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

కలసపాడు ఎస్ఐగా సుభాన్



కలసపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలసపాడు ఎస్ఐగా సుభాన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తిమోతి పులివెందులకు బదిలీపై వెళ్లారు. అక్కడ అటాచ్ ఎస్ఐగా పనిచేస్తున్న సుభాన్‌ను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిపెడతామన్నారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు

బద్వేలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులకు బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి తక్కువ ఛార్జీలతో బస్సులను ఏర్పాటు చేస్తున్నామని డిపో మేనేజరు నిరంజన్ ప్రకటనలో తెలిపారు. అధునాతన సూపర్ లగ్జరీ బస్సును అయ్యప్పస్వాములకు వీడియో సౌకర్యంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అతి తక్కువ ఛార్జీలతో బస్సును పంపుతున్నామని ఏడు మందికి ఉచిత ప్రయాణం అందిస్తున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో బస్సు పర్మిట్ ఫీజు ఉండదని తెలిపారు. ఇతర వివరాలకు 9959225779, 7382867104లను సంప్రదించాలని ఆయన కోరారు.

రైతన్నకు కలిసొచ్చిన వరి

● కుందూ పరిసర గ్రామాల్లో వరి కోతలు ఆరంభం ● ఆశాజనకంగా పంట దిగుబడులు ● తొండలదిన్నెలో పదేళ్లుగా వరి సాగే

దువ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికి వరి పంట ఎట్టకేలకు రైతన్నకు కలిసొచ్చింది. పంట విస్తారంగా సాగైనప్పటికి దిగుబడి ఎలాఉంటుందోనని ఆందోళన చెందిన రైతన్నకు ఆశాజనకంగా రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే అందుకు తగ్గ ధర కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపితే కష్టాలు తీరుతాయని వరి రైతులు కోరుతున్నారు. కాగా దువ్వూరు మండలంలోని కుందూ పరిసర గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా మొదలయ్యాయి. కుందూ నీటి ఆధారంగా ముందుగానే పంట సాగు కావడంతో ఇప్పుడు కోత దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో పంటను తీస్తున్నారు. దువ్వూరు, పెద్దజొన్నవరం, నేలటూరు, జిల్లేళ్ల, కానగూడూరు గ్రామాల్లో కుందూ నీటిని తోడే విధంగా మోటార్ల సౌకర్యం ఉండడంతో ముందస్తుగానే వరి నాటారు. పంట తీసే సమయం రావడంతో ఆ పనుల్లో సంబంధిత రైతులు నిమగ్నమయ్యారు. ఈ పరిధిలో కొన్నిచోట్ల దిగుబడులు పర్వాలేదనిపించినా ముంపునకు గురైన పొలాల్లో ఆశించిన మేరకు రావడంలేదని రైతులు వాపోతున్నారు. తొలగించిన దిగుబడులను వారికి అనుకూలమైన ప్రాంతాలకు తరలించి గింజలను ఆరబెడుతున్నారు. కేసీ ఆయకట్టులో మరో 15 రోజుల తర్వాత వరి కోతలు మొదలు కానున్నాయి.



వరి కోస్తున్న మిషన్



వడ్లను ఆరబెట్టిన దృశ్యం

తొండలదిన్నెలో పదేళ్లుగా వరి సాగే

రాజుపాలెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తొండలదిన్న గ్రామంలో గత పదేళ్లుగా కుందూ నది చాపాడు కెనాల్ కింద ఎన్‌డీఎల్ రకం వరి పంట సాగు చేస్తారు. ఈ రకానికి మార్కెట్లో మంచి గిరాకీ లభిస్తుంది. మద్దతు ధర కన్నా వంద రూపాయల ఎక్కువతో ఈ పంటను కొనుగోలు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతుంటారు. తొండలదిన్నె, వెలవలి గ్రామాల్లో దాదాపు 600 ఎకరాలు పైబడి ప్రతి యేటా ఈ పంట సాగులోకి వస్తుంది. ఇది గోడౌన్లలో నిల్వ చేసి గత ఏడాది వచ్చిన పంట ఇప్పుడు అమ్ముకోవడం, మళ్లీ కొత్త పంట నిల్వ చేసుకోవడం ఈ రైతులకు ఆనవాయితీగా వస్తోంది. ఈ సంవత్సరం కొంత మేర గిట్టుబాటు ధర లేకపోయినా దిగుబడులు ఆశాజనకంగా రావడంతో ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వసుతందని రైతులు తెలిపారు. ఈ దిగుబడులు మార్కెట్లో అంతో ఇంతో గిరాకీ ఉండడంతో రైతులకు కాస్త ఊరట లభిస్తుంది. ఏదిఏమైనా ఎన్‌డీఎల్ రకానికి మంచి గిరాకీ వస్తుంది.

ఆ మండల కేంద్రంలో అన్నీ సమస్యలే

కాశినాయన, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) కాశినాయన మండల కేంద్రమైన నర్సాపురం సమస్యల ఎదురీతలో కొట్టుమిట్టాడుతోంది. మండలం ఏర్పాటై దాదాపు 2 దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. మారుమూల మండలమైన నర్సాపురానికి సమీప పట్టణమైన పోరుమామిళ్ల నుంచి రవాణా రహదారి సౌకర్యాలుకూడా అంతంతమటుకే ఉన్నాయి. దాదాపు మూడువేల జనాభా ఉన్న నర్సాపురం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని చెప్పవచ్చు. ఎటుచూసినా అసంపూర్తిగా దర్శనమిస్తున్న ప్రభుత్వ భవనాలు, గుంతలు పడిన రోడ్లు, కుంగిన డ్రైనేజీ కాలువలు కనిపిస్తాయి. నర్సాపురం నడిబొడ్డున 2014-19 సంవత్సరాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో సంత నిర్మాణం, ఉర్దూ పాఠశాల భవనం పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోక పోవడంతో అవి నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ లైబ్రరీ నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ మండ లంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన డీసీ. గోవిందరెడ్డి, ఆకుల నారాయణపల్లె గ్రామానికి చెందిన తిరివీధి జయరాములు బద్వేల్ నియోజకవర్గ ప్రజా ప్రతినిదులుగా ఎంపికై చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించినప్పటికీ సొంత మండలం అభివృద్ధిలో తమదైన ముద్ర వేయలేకపోయారనే ప్రజల్లో అపోహలున్నాయి. మండలం ఏర్పడినప్పటి నుంచి నర్సాపురానికి మంజూరైన ఎస్సీ బాలుర వసతి గృహం అద్దెభవనంలోనే నడుస్తుంది. మరోవైపు మండలానికి తలమానికంగా ఉన్న కాశినాయన జ్యోతీక్షేత్రంలో అటవీశాఖ ఆవ రోధాలతో అవధూత కాశిరెడ్డి నాయన గుడి నిర్మా ణం అర్థాంతరంగానే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వంలోనైనా మండల కేంద్రంలో మౌలి క వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



నర్సాపురంలో అసంపూర్తిగా ఉన్న సంత నిర్మాణపనులు

దళిత సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

బద్వేలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం దళిత సంక్షేమ పథకాలు పునరుద్దరించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేల్ కోరారు. ఆదివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని జేవీ భవన్‌లో నిర్వహించిన డీహెచ్‌పీఎస్ ఏరియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన ఎన్నికల ప్రచారంలో దళితుల సంక్షేమంపై మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వాటిని పునరుద్ధరించి దళిత అభ్యున్నతికి పాటుపడతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికి కూడా ఆ హామీ మేరకు దళిత సంక్షేమ పథకాలు పునరుద్ధరణ కాలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఈ నెల 15న దళిత హక్కుల పోరాట సమితి ఆందోళన చేపడుతుందని ఈ ఆందోళనలో పేద దళిత బడుగు వర్గాలుపాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో లోకకల్యాణార్థం మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉపగ్రహ, ఉపదేవతా, మృత్యుంయ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి హోమద్రవ్యాలను పూర్ణాహుతి సమర్పించారు.

పోరుమామిళ్లలో : పోరుమామిళ్లలోని బ్రాహ్మణవీధిలో వెలిసిన బాలసుందరి త్రిపురదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం కావడంతో ఆదివారం తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, మహానాస్య పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కత్తెరగండ్ల సత్యనారాయణరెడ్డి, చిలేకాంపల్లె నాగేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, ఆలమూరి మురళి, శ్రీను, తులసి సుబ్బయ్య పాల్గొన్నారు.

మారెమ్మ తల్లికి భూపేశ్‌రెడ్డి పూజలు



మైలవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కంబాలదిన్నెలో వెలసిన మారెమ్మ అమ్మవారిని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డిలు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారిని సత్కరించారు.

ఘనంగా ఆర్మీ సాయుధ దళాల జెండా దినోత్సవం



ఆర్మీ జవాన్లను సన్మానిస్తున్న దృశ్యం

బద్వేలు, డిసెంబర్7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం ఆర్మీ సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రక్షణకు పనిచేసిన ఆర్మీజనవాన్లను సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల పరిపాలనాధికారి సాయిక్రిష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న సాయుధ దళాలకు చెందిన సైనికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్లను కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ బాల ఓబులేసు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల ఆత్మహత్యలపై రిటైర్డు హైకోర్టు జడ్జితో ప్రభుత్వం విచారణ జరపాలని గ్రామ, వార్డు సచివాలయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులపట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి, మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఈ ఒత్తిడిని భరించలేక గత వారంలో రాష్ట్రవ్యాప్తంగా నలుగురు ఉద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 50 ఇళ్లకు ఒక వలంటీరు పనిచేస్తే ప్రస్తుతం 200 ఇళ్లను సచివాలయ ఉద్యోగి పనిచేయాల్సి వస్తోందని దీనివలన ఉద్యోగులపై తీవ్రంగా పనిభారం పడుతోందన్నారు. దీనిపై విచారణ జరపాలని కోరారు.

10న రైతుల సమస్యలపై ఆందోళన

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై ఈనెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర అన్నారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల కూటమిప్రభుత్వ వైఖరికి నిరసనగా సీపీఐ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు చాంద్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి డీఎల్ జన్మదిన వేడుకలు



అభిమానుల నడుమ కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి

ఖాజీపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి డాక్టర్ డీఎల్ రవీంద్రారెడ్డి 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని లారెన్స్ వృద్ధాశ్రమం, అమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతోపాటు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్ అభిమాని గురుమోహన్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలకు వృధాగా డబ్బులు ఖర్చు చేసేందుకంటే అనాథలకు, వృద్ధులకు అన్నదానం చేస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష



జమ్మలమడుగు బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా ఆదివారం జరిగింది. జమ్మలమడుగులో ఉన్నతాధికారులు అయిదు కేంద్రాల్లో బాలుర జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, గర్ల్స్ హైస్కూలు, బాలాజీ హైస్కూలు, సెయింట్‌మేరీస్ హైస్కూలులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. ఈ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి ఎంపికైన విద్యార్థులకు 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.16 వేలు ప్రోత్సాహకం అందిస్తుందని ఎంఈవో చంద్రశేఖర్‌రావు తెలిపారు. 875 మంది దరఖాస్తు చేసుకోగా 841 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు వారి సిబ్బందిని ఏర్పాటు చేశారు.

మద్దిమాను గురప్ప స్వామికి ప్రత్యేక పూజలు



మద్దిమాను గురప్పస్వామి ఆలయంలో ఏపీఐఐసీ డైరెక్టరు వడ్డెబోయిన ప్రసాద్‌రెడ్డి

పోరుమామిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :పోరుమామిళ్ల మండలంలోని మద్దిమాను గురప్పస్వామికి ఏపీఐఐసీ డైరెక్టరు వడ్డెబోయిన ప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆయన రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గురప్పగారిపల్లె సమీపంలోని సగిలేరు వద్దున వెలసిన మద్దిమాను గురప్పస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు మల్లిఖార్జునరెడ్డి, ఈవో రామలింగారెడ్డి, బ్రాహ్మణపల్లి సొసైటీ చైర్మన్ టి.రామానాయుడు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌లో దుప్పట్లు పంపిణీ



నైట్ షెల్టర్‌లో వారికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం జమ్మలమడుగు రోడ్డులోని నైట్‌షెల్టర్‌లో తలదాచుకునే పేదలకు శివపురం వెంకటేశ్వర్లు ధర్మపత్ని మంజుశ్రీ కుమారుడు తరుణ్‌కుమార్ రోటరీ దొంతు మురళీలు చలినుంచి రక్షణ కోసం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైట్‌షెల్టర్‌లో ఉన్న వారికి దుప్పట్లు అందజేశారు. అలాగే విద్యార్థి అనాథ శరణాలయంలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గజ్జల వెంకటేశ్వర్లు, దొంతు మురళీ, బీసీ సమాఖ్య కార్యదర్శి బీవీ రాజు , తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సమావేశాలను జయప్రదం చేయండి



జమ్మలమడుగులో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల వివరాలు తెలియజేస్తున్న నేతలు

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ 79వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సంఘం నేతలు పిలుపునిచ్చారు. జమ్మలమడుగు పట్టణంలో ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నేత గురుకుమార్ మాట్లాడుతూ మొదటిసారిగా ఈనెల 13, 14 తేదీల్లో రీజియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనమండలి సభ్యుడు కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు, సీపీఐ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు కుండా భాస్కర్, రీజియన్ కన్వీనర్ మహ్మద్‌గౌస్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కమ్మవారిపల్లెలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ బొజ్జ అనూష

పోరుమామిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాతీయ సేవా పథకం విభాగం కోఆర్డినేటరు కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో కమ్మవారిపల్లెలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ అనూష పాల్గని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు ప్రత్యేకంగా మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, అరికాళ్ల మంటలకు వైద్యపరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



ఎరువుల పంపిణీలో పాల్గొన్న బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుప్రజా

పోరుమామిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజా పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే యూరియా పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గన్నారు. కేంద్రం రైతుల కోసం రూ.2500 విలువ చేసే యూరియాను సబ్సిడీ ధరతో ఇస్తోందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బద్వేలు అసెంబ్లీ కోకన్వీనరు పల్లెంశెట్టి పండరి, మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ, మండల కమిటీల నాయకులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కార్యకర్తలకు దిశ, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రుషికేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేష్, సుధీర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వంగల భాస్కర్‌రెడ్డి, పరిశీలకులు భరత్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.